మినీ కథ

# "ఉపాయం"

భగవంతరావు కొడుకు ధైర్యం చేశాడు.

భగవంతరావు ఆఫీసు నుంచి జీతం అందుకుని వచ్చి, చొక్కా విప్పి వంకీకి తగిలించి, స్నానం గదిలోకి వెళ్ళగానే, తండ్రి చొక్కాలోంచి పర్స్ తీశాడు. తెరచి లెక్కపెట్టాడు. ఆరు వంద రూపాయల నోట్లు, కొంత చిల్లర నోట్లు. రెండు 'వంద' రూపాయల నోట్లు తీసి జేబులో వేసుకుని ఆ పర్స్‌ని కూడా తన జేబులోనే వేసుకున్నాడు

స్నానం ముగించి సంధ్య వార్చాక ఇంటాయనకి అద్దె ఇవ్వడానికి చొక్కా జేబులు, పేంట్ జేబులు వెదికాడు పర్స్ కోసం జీతంతో నిండిన పర్స్ కనబడ లేదు. మాయమయింది!

ఇంటికి వచ్చేదాకా అది జేబులోనే వున్నట్లు గుర్తు భగవంతరావుకి ఆ తర్వాత ఆ ఇంట్లో గంటదాకా అరుపులు అనుమానాలు, కన్నీళ్ళు.

భగవంతరావు కొడుకు మర్నాడు వుదయం తనకు ప్రాణమిత్రుడయిన ఓ పోలీస్ కాన్‌స్టేబుల్ దగ్గరికి వెళ్ళాడు.

"చిన్న సహాయం చేయాలి గురూ!" అన్నాడు తండ్రి జేబులోంచి దొంగిలించిన పర్స్‌ని కాన్‌స్టేబుల్‌కిచ్చి. ఓ పావు గంటసేపు విడమరిచి చెప్పాడు ఆ సాయంత్రం కాన్‌స్టేబుల్ ఏం చేయాలో.

కాన్‌స్టేబుల్ పర్స్ తెరిచి, "నాలుగు వందల అరవై చిల్లర వుంది. నువ్వు రెండు వందలు కాజేశావా?"

"మా నాన్నలా గుర్రప్పందాలకి తగలెయ్యను. మా అమ్మ చాలా రోజుల నుంచి ముచ్చటపడుతున్న, తాకట్టులో వున్న బంగారపు గొలుసు విడిపిస్తానంతే."

ఆ సాయంత్రం భగవంతరావు దగ్గరకి వచ్చి అడిగాడు కాన్‌స్టేబుల్ "భగవంతరావుగారుండేది ఇక్కడేనా?"

"అవునుఏం" అన్నాడు భగవంతరావు.

"మీ వస్తువేదయినా పోయిందా?"

"పర్స్ పోయింది. దాంట్లో ఆరువందల అరవైదాకా వుండాలి. మీగ్గాని దొరికిందా?" అడిగాడు భగవంతరావు.

తల వూపి చెప్పాడు పోలీస్ కాన్‌స్టేబుల్ తన మామూలు ధోరణిలో "నిన్న బస్‌లో జేబులో కొట్టే పిక్‌పాకెటర్‌ని పట్టుకుంటే అయిదారు పర్సులు దొరికాయి. ఒకటి మీది ఎవరివి వాళ్ళకి అందచేస్తున్నాం. ఎంత వుందన్నారు పర్సులో?"

"ఆరువందల అరవై."

"మీరు దురదృష్టవంతులు. అదృష్టవంతులు కూడా రెండూనూ. రెండు వందలు ఖర్చుపెట్టేశానని చెప్పాడు. నాలుగువందలుఅరవై మిగిలి వుంది. చూసుకోండి" అందించాడు పర్స్‌ని

భగవంతరావు లెక్కపెట్టి తృప్తిగా నిట్టూర్చి, ఆ కాన్‌స్టేబుల్‌కి బహుమతిగా ఇరవై రూపాయలు ఇచ్చాడు.

తను రేసుల్లో ఖర్చుచేయదలచుకున్న రెండువందలు పోయినా, ఇంటి ఖర్చుకు సరిపడే నాలుగువందల అరవై రెండు రూపాయలు లభించడంతో ఏనుగెక్కినంత సంతోషపడ్డాడు భగవంతరావు. రెండు రోజుల తర్వాత ఆ బంగారు గొలుసు విడిపించాడు భగవంతరావు కొడుకు—తను దాచుకున్న డబ్బుతో.

—మల్లాది వెంకటకృష్ణమూర్తి